క్లుప్తంగా

ధాన్యం ట్రాక్టరు బోల్తా



కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ధాన్యం లోడ్ ట్రాక్టరు

సామర్లకోట: కెనాల్ రోడ్డులో మాండవ్య నారాయణస్వామి ఆలయం వంతెన వద్ద బుధవారం ధాన్యం లోడ్ ట్రాక్టరు బోల్తా పడింది. ఉండూరు గ్రామం నుంచి కెనాల్ రోడ్డులో ద్వారపూడి వెళుతున్న సమయంలో ట్రాక్టరు అదుపు తప్పింది. ట్రాక్టరు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎవరికీ అపాయం జరగలేదు. మరో ట్రాక్టరులో ధాన్యాన్ని లోడ్ చేసి, ద్వారపూడి రైసు మిల్లుకు తరలించారు.


ఘనంగా ఆదిలక్ష్మీతల్లి తీర్థం

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామ దేవత ఆదిలక్ష్మీతల్లి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. తీర్థం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాకతిప్పతో పాటు కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రబాబు ఉన్మాదిగా ప్రవర్తిస్తున్నారు

పిఠాపురం: టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్మాదిగా ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత అన్నారు. పిఠాపురంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలో హోంమంత్రి తానేటి వనితపై దాడి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. విజయవాడలో బోండా ఉమా అనుచరులు మహిళలపై దాడులు చేయడం చూస్తుంటే చంద్రబాబు ఎలాంటి వాడో ప్రజలకు అర్థమవుతోందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కుతో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె కోరారు.

వైభవంగా నల్లకొండమ్మతల్లి జాతర



నల్లకొండమ్మతల్లి

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం నల్లకొండమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. అమావాస్యను పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతరను కన్నులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్ల, గరగల సంబరం, బాణసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా చండీ,ప్రత్యంగిర హోమాలు



రత్నగిరిపై కనకదుర్గ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: చైత్ర అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి, తొలి పాంచా వద్ద కొలువైన కనకదుర్గమ్మ వారికి ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన చైత్రమాసోత్సవాలు

రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి గత పది రోజులుగా నిర్వహిస్తున్న చైత్ర మాస పూజలు బుధవారం నిర్వహించిన చండీహోమంతో ముగిశాయి. సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, దేవస్థానం వైదిక కమిటీ సభ్యుడు చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, కనకదుర్గ ఆలయ అర్చకుడు కంచి భట్ల సాయిరామ్ తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని: పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. విద్యార్థులు ఎస్ఎస్‌సీ, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, కలర్ ఫొటోలు ఈ–మెయిల్ ఐడీ, ఆధార్ లింక్ కలిగిన ఫోన్ నంబర్‌తో ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ప్రగతి పథాన..

- వైఎస్సార్ సీపీ హయాంలోనే పెద్దాపురం పట్టణాభివృద్ధి
- ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- సచివాలయ వ్యవస్థతో యువతకు ఉపాధి
- నాడు–నేడుతో మౌలిక సదుపాయాల కల్పన



పెద్దాపురం పట్టణంలో వాలుతిమ్మాపురం రోడ్‌లో లబ్ధిదారులకు ఇచ్చిన టిడ్కో గృహ సముదాయం

పెద్దాపురం: కాకినాడ జిల్లాలోని తొలి మున్సిపాలిటీ పెద్దాపురం 1915లో ఆవిర్భవించింది. ప్రస్తుతం 29 వార్డులు కలిగిన ఈ మున్సిపాలిటీ 41.13 కి.మీ. విస్తీర్ణంలో ఉంది. కాగా 24,406 మంది పురుషులు, 25,173 మంది మహిళలు వెరసి.. 49,579 మంది జనాబా ఉన్నారు. పట్టణ పరిధిలో సుమారు 11,500 గృహాలుండగా, పురుష ఓటర్లు 19,539 మంది, మహిళా ఓటర్లు 21,244, ఇతర ఓటర్లు ఏడుగురు మొత్తం 40,790 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు.

పెద్దాపురం పట్టణంలో 50 పడకల ఏరియా ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు, ఎనిమిది ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ కళాశాలతో పాటు, 24 మున్సిపల్ పాఠశాలలు, 26 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక వంటి పథకాలతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వైఎస్సార్ సీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పెద్దాపురం పట్టణంలోని 14 సచివాలయాల్లో 107 మందికి ఉద్యోగాలు లభించాయి. వలంటీరు వ్యవస్థతో పదో తరగతి అర్హతతో 240 మందికి స్థానికంగా ఉపాధి లభించింది.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజా సమస్యలలు, పట్టణాభివృద్ధిపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇళ్లు లేని నిరుపేదలకు వాలుతిమ్మాపురం రోడ్డులో 3,312 ప్లాట్లు కేటాయించి, 2019 నుంచి సుమారు రూ.20 కోట్లతో రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. రూ.221 కోట్లతో టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పేరిట సూరంపాలెం రోడ్డులో 2,550 మంది లబ్ధిదారులకు వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు మంజూరు చేయగా, 1,400 మంది ఇప్పటికే గృహాలు పూర్తి చేశారు. ఆయా కాలనీల్లో కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలను కల్పించారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వం రూ.4.50 కోట్లతో మున్సిపల్ పాఠశాలలు అభివృద్ధి చేశారు. రూ.రెండు కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. సుమారు రూ.పది లక్షలతో రెండు చిల్డ్రన్ పార్కులను అభివృద్ధి చేశారు. పట్టణంలో 14, 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ.6.30 కోట్లతో పైపులైన్లు, డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధికి రూ.4.05 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు.



పెద్దాపురం పట్టణంలో నాడు–నేడులో నిర్మించిన ఓ రోడ్డు

పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు



మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అమలు చేశాం. గతంలో ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి విసిగిపోయేవారు. ప్రస్తుతం ప్రజల వద్దకే పథకాలు రావడంతో ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బొడ్డు తులసీ మంగతాయారు, మున్సిపల్ చైర్‌పర్సన్, పెద్దాపురం

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



రావివారిపోడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా లబ్ధిదారులకు ఇంటికే సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు కోరారు. మండలంలోని పొన్నాడ శివారు రావివారిపోడులో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి పిఠాపురం ఎమ్మెల్యేగా వంగా గీత, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బావిశెట్టి నారాయణస్వామి, బదిరెడ్డి తమ్మన్న దొర, బొమ్మిడి గోవింద్, బొమ్మిడి రాంబాబు, బవిశెట్టి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



చెందుర్తిలో మహిళల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వంగా గీత

పిఠాపురం: గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం మండలంలోని ఎల్ఎన్‌పురం, మంగితుర్తి, మాధవపురం గ్రామాల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. స్థానికులు ఆమెకు హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికి సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటివరకూ తాను పిఠాపురం మండలంలో చేసిన అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి పిఠాపురం ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పథకాల కొనసాగింపు

గొల్లప్రోలు: రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని చెందుర్తిలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో జగనన్న ప్రవేశపెట్టి అమలు చేశారని కొనియాడారు. ఒకవైపు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూనే మరో వైపు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేయడమే కాకుండా తమ ప్రభుత్వంలో మీకు మేలు జరిగితేనే తనకు ఓట్లు వేయమని అడిగిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మాటతప్పని, మడమ తిప్పని నేత జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి పిఠాపురం ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



పిఠాపురం మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

పవన్ చిత్తుగా ఓడిపోవడం ఖాయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కుమార్తె పావని, అల్లుడు సురేష్
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్మికుడిని ఓటు అభ్యర్థిస్తున్న పావని, సురేష్

పిఠాపురం: పిఠాపురంలో పవన్‌కల్యాణ్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కుమార్తె పావని, అల్లుడు సురేష్ అన్నారు. పిఠాపురంలో వంగా గీత తరఫున బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్న తీరును చూస్తుంటే వంగా గీత గెలుపు నల్లేరుమీద నడక మాదిరిగానే ఉందన్నారు. తాము కేవలం మెజార్టీని పెంచడానికి మాత్రమే ప్రచారం చేస్తున్నామన్నారు. ఎండైనా, వానైనా ఎటువంటి అలసట లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామంటే ప్రజల ఆదరణే కారణమన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అడుగడుగునా పట్టణ ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. వంగా గీత వెంటే తామంతా ఉంటామని హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ అపోహలు వద్దు

పెద్దాపురం ఈఆర్ఓ సీతారామారావు



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఈఆర్ఓ

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు వస్తున్న సోషల్ మీడియా ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని, అటువంటి అపోహలను ప్రతి ఒక్కరూ తొలగించుకోవాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఈవీఎంల పనితీరుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ఓటింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. సాంకేతిక పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముందస్తుగానే ప్రతి అంశాన్ని రాజకీయ పార్టీల సమక్షంలోనే సాంకేతిక పరిజ్ఞానంతో ముందస్తు చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, డీటీ భానుకుమార్, చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ) నూనె రామారావు (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

మీ వాడిని.. ఆశీర్వదించండి



అచ్చంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దొరబాబు



సామర్లకోట 23వ వార్డులో ప్రచారం చేస్తున్న చంద్రకళ

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు

సామర్లకోట: 'మీ మధ్య పుట్టి పెరిగిన స్థానికుడిని.. నన్ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించండి' అంటూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం సాయంత్రం అచ్చంపేట గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మాజీ ఎంపీపీ అత్తిలి వెంకటసీతారామస్వామి, ఎంపీటీసీ వింటి కృష్ణ ఆధ్వర్యంలో దొరబాబు తన కుమార్తె సార్వికతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు సామాజిక పింఛన్లు పొందే వారిని కష్టాలకు గురి చేస్తున్నారని దొరబాబు మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, ఇంటి వద్దకే పింఛన్లు వస్తాయంటూ భరోసా ఇచ్చారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి నాయకులకు బుద్ధి చెప్పేలా ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలన్నారు. ఏదో విధంగా చంద్రబాబు అధికారంలోకి రావాలని ప్రజలను మభ్యపెట్టేలా మేనిఫెస్టో తయారు చేశారని, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి.. ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ చంద్రబాబు అమలు చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు మేనిఫెస్టోకు, తమకు సంబంధం లేదని బీజేపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి అవకాశం లేకుండా చేశారని స్పష్టం చేశారు. ప్రచారంలో దొరబాబుకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఎలిశెట్టి భీమన్నదొర, ముసిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ ఫలాలు: చంద్రకళ

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు భార్య చంద్రకళ అన్నారు. బుధవారం ఆమె 21 ,22 వార్డుల్లో కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. తన భర్త దొరబాబును ప్రతి ఒక్కరూ సొంత కుటుంబ సభ్యునిగా భావించి ఆశీర్వదించాలన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు పెండ్యాల వెంకటనాగలక్ష్మి, రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, గుబ్బల సత్యనారాయణ, తోటకూర గంగాధర్, పెండ్యాల అబ్బు, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేగులమ్మ జాతర



దుర్గాడలో అమ్మవారి జాతరను ప్రారంభిస్తున్న దాట్ల వెంకటసుబ్రహ్మణ్య వర్మ

గొల్లప్రోలు: మండలంలోని దుర్గాడలో వేగులమ్మతల్లి జాతర బుధవారం వైభవంగా జరిగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో దాట్ల వెంకట సుబ్రహ్మణ్యవర్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రారంభించారు. అమావాస్య కావడంతో ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. తీన్‌మార్ డ్యాన్స్‌లు, గరగల సంబరం, భజనలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మందుబాబులను పోలింగ్ కేంద్రాల్లో నిషేధించాలి

బోట్‌క్లబ్: మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ఎంత ప్రమాదమో, మద్యం సేవించి పోలింగ్ ప్రక్రియకు రావడం అంతకు మించిన చేటని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. మద్యం సేవించి పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లను పూర్తిగా నిషేధించాలంటూ కాకినాడ సిటీ ఎన్నికల ఆర్ఓ జె.వెంకటరావుకు ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. మందుబాబులు పోలింగ్ కేంద్రాల వద్ద సంచరించకుండా ఈ నెల 13న ప్రత్యేక బృందాలతో బ్రీత్ ఎనలైజర్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పోలింగ్ బూత్‌లకు వంద మీటర్ల దూరంలో పార్టీ అభ్యర్థులు, వారి వ్యక్తుల సమూహాలు లేకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. మద్యం మత్తుతో పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించిన వారు ఈవీఎంలను ధ్వంసం చేసే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 3,136 ఓట్ల నమోదు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్



పీఆర్ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా 4,250 మంది ఉద్యోగులకు 3,136 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ తెలిపారు. బుధవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఆయన జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన ఉద్యోగులతో కలెక్టర్ నివాస్ మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ, పొరుగు జిల్లాలో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు మంగళ, బుధవారాల్లో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సుమారు 74 శాతం మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారన్నారు. రెండో రోజు తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉద్యోగులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించినట్టు తెలిపారు. ఆయన వెంట డీఆర్వో డి.తిప్పేనాయక్, కాకినాడ కమిషనర్ జె వెంకటరావు, జిల్లా ఉపాధి శిక్షణాధికారి, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జేసీ రామ్‌సుందర్‌రెడ్డి పరిశీలన

రెండో రోజు బుధవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.